తర్వాత నిశాంత ఆ విషయమే మరిచిపోయింది. కానీ అతను ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నాడు.

సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన ఎన్నో పుస్తకాల్ని రిఫర్ చేశాడు.

ప్రపోజల్‌నితయారుచేసి మహంతకు పంపాడు. మహంత ఆ ప్రపోజల్‌కు మరిన్ని మార్పులు చేర్పులు చేశాడు. ఎక్స్‌పర్ట్స్ చేత రిపోర్ట్స్ తయారు చేయించాడు.

డెలిగేట్స్ మీటింగ్ సాయంత్రం వరకూ జరిగింది. నిశాంత ఎక్కడి కెళ్ళిందో అనూహ్యంగా వుందతనికి. ఆమె దగ్గరనుంచి వచ్చే ఫోన్‌కకాల్ కోసం ఎదురుచూస్తున్నాడు.

సరిగ్గా అదే సమయంలో వచ్చాడు అనంతమూర్తి గాభరాగా.

"థ్యాంక్ గాడ్! మీ ఫ్లయిట్ ప్రమాదానికి అసలు కారణం తెల్సింది. వాంటెడ్‌గానే టాంక్‌కి సగం ఫ్యూయల్‌ని నింపారట"

"ఎవరు చేసారా పని?" ఆశ్చర్యంగా అడిగాతను.

"ఎక్వయిరీ జరుగుతోంది" చెప్పాడు అనంతమూర్తి.

"ఎందుకయినా మంచిదంటే ........నాకు శత్రువులున్నారని మీ ఒపీనియన్."

"ఎస్ మిస్టర్ సిద్ధార్థ! నీకు వుండకపోవచ్చు.........కానీ మీ డాడీ శత్రువు కన్ను నీ మీద పడి వుండొచ్చుకదా?" నర్మగర్భంగా అన్నాడు అనంతమూర్తి.

"అంటే........"

"ఫ్రాంక్‌లీ సేయింగ్........నిశాంతపట్ల నాకు కొన్ని అనుమానాలు వున్నాయి."

అనంతమూర్తి ఇలా అడగటం వెనక దేశ్‌ముఖ్ నుంచి వచ్చిన మెసేజ్ అసలు కారణం.

"మీరు నిశాంతను ఎందుకు అనుమానిస్తున్నారో నాకర్థం కావడం లేదు?" సూటిగా ప్రశ్నించాడతను.

"నిశాంత మిమ్మల్ని కలవడం, మీతో స్నేహాన్ని పెంచుకోవటం, మిమ్మల్ని తన వెంట తిప్పుకోవటం........ఇదంతా గూడుపుఠాణీలా వుంది- అసలు ఆమె ఎవరో, ఏంటో ఎప్పుడయినా కనుక్కున్నారా మీరు?" ఆమెపై అతని అభిప్రాయాన్ని నెమ్మదిగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అనంతమూర్తి.

"మహంత ఎంపైర్‌కి కాబోయే చీఫ్ మీరు........ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా వుండటం అవసరం" హెచ్చరించాడు అనంతమూర్తి.

"నిశాంతను నేను అనుమానించలేను."

అతనివేపు ఆశ్చర్యంగా చూసాడు అనంతమూర్తి.

* * * * * * * * * * *

విక్టోరియా గార్డెన్స్ మెయిన్ గేట్‌లోంచి లోనికి దూసుకెళ్ళినకారు పార్కింగ్ ప్లేస్ లో ఆగింది.

సిద్ధార్థ....... అతని వెనక నిశాంత దిగారు.

"నీకు శత్రువులున్నారంటే నమ్మలేకపోతున్నాను. అందులోనూ నిన్ను చంపాలనుకునే వాళ్ళు!" ఆశ్చర్యం ప్రకటించిందామె.

అనంతమూర్తి చెప్పిన విషయం అతని ద్వారా విన్న నిశాంత మొట్టమొదటి అనుమానించిన వ్యక్తి దేశ్‌ముఖ్.

సిద్ధార్థతోపాటు తనని కూడా చంపాలని ఆయన ఎందుకు నిర్ణయించారు? మనసులోనే మధన పడుతోందామె. సిద్ధార్థతో తన ప్రేమ వ్యవహారాన్ని ఆయన తెలుసుకున్నాడా? ఆయన వ్యూహాన్ని మార్చుకున్నాడా?

కోరలు, కొమ్ములు లేని వింత జంతువు పగ........మనిషిలోని మానవత్వాన్ని చంపేసే మౌన మారణాయుధం పగ.

ఆ పగను తుడిచేసి ఆయనను మళ్ళీ మనిషిని చేయగలిగితే.........తీవ్రంగా ఆలోచిస్తూ అనాలోచితంగా అతని వెనక నడుస్తున్నదామె.

"నిశాంతా! నిన్ను ప్రశ్న వేస్తాను జవాబు చెపుతావా?"

అతని ముఖం సీరియస్‌గా వుంది.

"నన్ను నువ్వు ప్రేమిస్తున్నా వా లేదా? అదే కదా నీ ప్రశ్న? ఎన్ని సార్లు జవాబు చెప్పాలి?" విసుగును ప్రకటిస్తూ అందామె.

అతని మనసులో వుప్పెనల్లా పొంగుతున్నాయి. తనని తాను కంట్రోల్ చేసుకోడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడతను ఆమె ప్రేమ వెనక కృత్రిమతను అతన్నెప్పుడో గమనించాడు. 'నిశాంతపట్ల నాకు కొన్ని అనుమానాలు' అనంతమూర్తి వ్యక్తం చేసిన అనుమనం అతనిలో నాటుకుపోయింది

"నిశాంతా! నువ్వెవరు?" సూటిగా, బలంగా వచ్చిందా మాట అతని నోటివెంట.

"నేనా? ఓ అమ్మాయిని.....నిన్ను......" నవ్వబోయిందామె.

చివ్వున అతని నరాల్లో కోపం పొంగడం, వెంటనే అతని కుడి చేయి విసురుగా పైకి లేచి ఆమె చెంపను తాకడం.....అంతా ఒకే ఒక క్షణంలో జరిగిపోయింది.

ఆమె కళ్ళలో చివ్వున కన్నీళ్ళు చిమ్మాయి.

"నువ్వు అకస్మాత్తుగా ముసోర్రీలోకి అడుగుపెట్టావ్ అకస్మాత్తుగా బిజినెస్ స్టార్ట్ చేసావ్......యంగ్ ప్యాలెస్‌లోకి మామూలు ఆడపిల్ల ఎవరూ అంత డేరింగ్‌గా, డేషింగ్‌గా రాలేదు. కానీ నువ్వొచ్చావ్......నువ్వొచ్చింది నన్ను తాగించడానికి........నువ్వు ఎక్కడకు రమ్మంటే ఎందుకొచ్చానో తెలుసా? ఎప్పుడయినా, ఒక్కసారయినా నా గురించి నువ్వు చెప్తావను

నువ్వెక్కువ చదువుకోలేదని నాకు తెలుసు నీ తెలివితేటల్ని వుపయోగించి బ్రతుకుతున్నావని నాకు తెలుసు నీ ప్రేమ ఓ ముసుగని అసలు నువ్వొచ్చిన పని ఇంకేదో వుందని నేనెప్పుడో గమనించాను.

నీ వెనక బార్లకు వచ్చింది ఎప్పుడైనా, ఒక్కసారైనా నువ్వు చెప్పేనిజం విందామని ఎప్పుడూ.......ఎప్పూడూ ......నువ్వా ప్రయత్నం చెయ్యలేదు ఇంతవరకు ఏ విషయంలోనూ నిన్ను నేను ఒక ప్రశ్న కూడా ఎందుకు వెయ్యలేదో తెలుసా?”

నిశాంత ముఖంలోకి చూశాడు అతను.

అప్పటికే నిశాంత ముఖంలో రంగులు మారిపోయాయి.

తన గురించి సిద్ధార్థకు ఎవరు చెప్పారు? ఎలా తెలుసుకున్నాడు? బయటకు రాని సవాలక్ష ప్రశ్నలతో సతమతమౌతోందామె.

“నిన్నిప్పటికీ నేను అనుమానించడంలేదు. ఎందుకో తెలుసా? నిన్ను నేను ప్రేమిస్తున్నాను గనక.....నా జీవితంలో నాకు సన్నితంగా వచ్చినదానివి నువ్వు నా మనసులో సున్నితమైన అనుభూతుల్ని నింపిన దానివి నువ్వు. నేను జైలులాంటి వాతావరంలో పెరిగాను నిజమే..........కానీ నా మనసు ఎప్పుడూజైల్లో లేదు. నా ఆలోచనల్ని, అవగాహనని పెంచుకోవడం కోసం నేను నీతో స్నేహం చేశాను. ఆ స్నేహాన్ని ప్రేమగా మార్చుకున్నాను కానీ నువ్వు ప్రేమను నటించావ్ కదూ!”

ఎర్రటి సిద్ధార్థ ముఖం మరింత ఎర్రగా మారిపోయింది

మాటలకోసం వెతుక్కుంటోంది ఆమె.

ఇలాంటి పరిస్థితి వస్తుందని ఆమె ఎప్పుడూ వూహించలేదు.

అనుకూలమైన సమయంలో తన గురించి నిజాన్ని చెప్పి అవసరమైతే సిద్ధార్థ కోసం దేశ్‌ముఖ్‌ను కూడా ఎదిరించడానికి మానసికంగా సిగ్గుపడ్డ నిశాంత-

అతడు తనని అనుమానించడానికి తనే అవకాశం ఇస్తోందని వూహించని నిశాంత-

అతడి ప్రతిభను తప్ప, మనసును అంచనా వెయ్యడానికి ఎప్పుడూ ప్రయత్నించని నిశాంత-

అతడి ఎదుట దోషిల నిలబడిపోయింది. అవమానంతో తల దించుకున్నదామె.

మొదటినుంచి జరిగిన సంఘటనలన్నీ ఒక్కసారిగా ఆమె కళ్ళ ముందు కదలాడాయి

భోరుమని ఏడ్చేసిందామె ఎలాంటి పరిస్థితినైనా అవలీలతా ఎదుర్కోడానికి తనని తాను మలచుకున్న వ్యక్తిత్వం అతడి మనసు ముందు, అతడి వ్యక్తత్వం ముందు.

వెల వెల పోయింది.

ఒక్కొక్క మాటనూ శ్రద్ధగా వింటున్నాడు అతను.

తను తన పుట్టుక, తన బాధ, తన ఆక్రోశం, తన పరిస్థితి ఏ ఒక్క విషయం దాచకుండా జరిగిన ప్రతి సంఘటననూ అతడి ముందుంచిందామె.

"నేనప్పుడూ నీ మనసుతో ఆడుకోలేదు సిద్ధార్థా! నా మనసుతోనే అడుకున్నాను. నీ ఎదుట నేను నవ్విన ప్రతి చిరు నవ్వూ నేను మింగిన కన్నీళ్ళకు తార్కాణం. నీ ఎదుట నేను నటించిన ప్రతి సంఘటనా నా నిస్సహాయస్థితికి నిదర్శనం.

నేనెప్పుడూ నిన్ను వంచించాలనుకోలేదు ఎందుకో తెలుసా? నేను నిన్ను ప్రేమించాను కాబట్టి. నా జీవితంలో నా అనుభూతుల్ని, నా స్పర్శను, నా ముద్దుని మొదటిసారిగా పొందిన మగవాడివి నువ్వు.

నా పేదరికాన్ని , నా ఊరు పేదరికాన్ని తొలగించుకోడానికి, ఆకలితో దుర్భరమైన పేదరికంతో ఆడతనాన్ని దాచుకోడానికి కనీసం చిరుగు గుడ్డకు కూడా నోచుకోని పరిస్థితుల్లో మా వూళ్ళో మరే అమ్మాయీ వుండకూడదు బలిపశువులా మరే అమ్మాయి బొంబాయి బజారు బజారులో పడకూడదు. మరే తండ్రి తన కూతుర్ని డబ్బుకోసం అమ్ముకోకూడదు.

నీ తెలీదు సిద్ధార్థా! పద్దెనిమిదేళ్ళ నా జీవితం నాకేమిచ్చిందో తెలుసా? నరకయాతన, ఓదార్చలేని కన్నీటి ఆక్రోశం.

కక్షను, పగను, అంతులేని కసిని నాలో నింపి నా మనసును నిర్ధాక్షిణ్యంగా చెరిపేసి నన్ను నీ ఎదుట మానవాయుధంలా నిలబెట్టిన వ్యక్తుల్ని నేను క్షమిస్తాను.

ఎందుకో తెలుసా?

అంతులేని నీ ప్రేమ, మాలిన్యం లేని నీ ప్రేమ, నీచూపులు, నీ ప్రేమ, నీ స్పర్శ, నీతోగడిపిన క్షణాలు నాకు జీవితంలో బ్రతుకు విలువను తెలిపాయి. మానవత్వం విలువల్ని తెలిపాయి. నా నవ్వు, నా మాట, నా ప్రవర్తన అంతా నటనే కావొచ్చు. కానీ అనుక్షణం రగిలిపోయే నా మనసును సేదనిచ్చింది నీ ప్రేమ.....నా ప్రేమ నటన కాదు సిద్ధార్థా!"

పొంగుకొచ్చిన దు:ఖం వల్ల ఆమె మరి మాట్లాడలేకపోయింది.

చెట్టుకి చేరబడి చేతుల్లో ముఖాన్ని పెట్టుకుని ఏడుస్తున్న ఆమె వేపు జాలిగా చూశాడు అతను.

నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి రెండు చేతులతో ప్రేమగ ఆమె ముఖాన్ని పైకెత్తాడు.

చూపుడు వేలితో కన్నీళ్ళను తుడిచాడు.

పెదవుల్ని మెల్లగా చుంబించాడు.

"సమస్యకు పరిష్కారం, మరొక సమస్యను సృష్టించుకోవడం కాదు కదూ!" నెమ్మదిగా అన్నాడు.

తలెత్తి విస్మయంగా చూసింది నిశాంత.

"ఐ లవ్ యూ నిశా! చాలా మంది డబ్బుకోసం ప్రేమిస్తారు. కానీ నువ్వు నీ గ్రామం కోసం, నీ మనుషులు కోసం నన్ను ప్రేమించావ్ మనది నిజంగా ప్రేమ కదూ!" నవ్వుతూ అన్నాడతను.

అతడి సహృదయతకు ఎలా స్పందించాలో తెలియడంలేదు ఆమె మనసంతా కృతజ్ఞతో నిండిపోయింది.

"అయామ్ సారీ సిద్ధార్థా!" అతని చేతిని పట్టుకొని పైకి లేస్తూ అంది.

ఇద్దరూ ముందుకు నడిచారు.

కారు స్టార్టు చేశాడు. అప్పుడు చెప్పాడతను.

"ఇప్పుడు కొత్త డ్రామా మొదలౌతోంది నిశా! అపారమైన శత్రుత్వంతో రాక్షసుడిగా మారిన మేధావిని మనిషిగా మార్చే డ్రామా. అపారమైన తెలివితేటలతో ప్రపంచాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకోవాలని దేనికైనా, ఎందుకైనా తెగించే మరొక మహా మేధావికి మానవత్వ్వ విలువను చూపించే డ్రామా. ఈ డ్రామాలో కూడా నువ్వే కీలకమైన పాత్రధారివి" వెలుతురు దీపాల మధ్య కాలంతో పరుగెత్తే జనారణ్యం మధ్య కారు సూటిగా చొచ్చుకుపోతోంది.

అతడిలో మొట్టమొదటిసారిగా ఓ కొత్త మనిషిని చూస్తోంది నిశాంత.

"లైఫ్ ఈజ్ నాట్ ఎడాల్, లైఫ్ ఈజ్ నాట్ ........ప్లే...... అందుకేనేమో నిర్ణయానికొచ్చాను.

ఆశ్చర్యంగా అతడి ముఖంలోకి చూసింది నిశాంత.

"నన్ను నువ్వు ప్రేమిస్తున్నావని స్పష్టంగా దేశ్‌ముఖ్‌కి చెప్పు" ఆమె పక్కలో బాంబు పడినట్టయింది ఆమాటకు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నానని..........మాడాడీ మహంతకు చెప్తాను" రెండో మాటతో శరీరంలో సూదులు దిగబడినట్టయింది ఆమెకు.

"నో సిద్ధార్థా! దేశ్‌ముఖ్ ఎంత మంచి మనిషో.......మహంత విషయంలోనూ, నీ విషయంలోనూ అంత ప్రమాదకారి నీ నాశనం కోసం అతని ఆస్తి మొత్తాన్నీ వెచ్చించడానికి సిద్ధంగా వున్నాడు ఈ పరిస్థితిలో" భయంగా అంది నిశాంత.

"నన్నెవరూ ఏమీ చెయ్యలేరు. నేను చెప్పినట్టుగా నువ్వు చెయ్యి దట్సాల్......" కోపంగా చెప్పాడు అతను. మరేం మాట్లాడలేకపోయింది నిశాంత.

* * * * * * * * * *

మడ్ ఐలాండ్-రహీజా సూట్లో దీర్ఘంగా ఆలోచిస్తూ పచార్లు చేస్తున్న దేశ్‌ముఖ్ వేపు సూటిగా చూస్తోంది నిశాంత.

"సిద్ధార్థను అతడితో పాటు అన్ను ఎందుకు చంపాలని చూపారు?"

రౌద్రాన్ని గమనించిన దేశ్‌ముఖ్ మనసులోనే నవ్వుతున్నాడు.

"మీరు చచ్చి పోలేదుగా" చాలా కూల్ అన్నాడు.

"అంటే ఫ్లయిట్‌లో ఫ్యూయల్ లేకుండా చేయించింది. మీరేనా? సిద్ధార్థతో పాటు పాటు నన్ను కూడా అడ్డు తొలిగించుకోవాలని మీరెందుకను కుంటున్నారు?" కోపంగా ప్రశ్నించింది ఆమె.

అంత కోపంగా దేశ్‌ముఖ్ కూడా నిశాంత సేపు చూశాడు.

"నీ కోసం, నీ ఊరుకోసం, నీ తండ్రికోసం.......ఇప్పటికి అయిదు కోట్లు ఖర్చు చేశాను. తెలుసా నీకా విషయం? ఎందుకు ఖర్చుపెట్టానో తెలుసు నీకు. చేతకాక......చేవలేక.....నేను చేసుకోలేక కూడా కాదు.